# చలం కథలు

ఈ వ్యాసానికి 'చలం కథలు' అన్న శీర్షిక కన్న 'చలం కథ' అంటే ఎక్కువ సమంజసంగా వుంటుంది. చలం ఎన్ని కథలు, నవలలు రాసినా, ఎన్ని నాటకాలు రాసినా – అందంతా కలిపి ఒకే ఒక్క కథ – చలం కథ. అది ఒక విధంగా చలం తన్ను గురించి తాను చెప్పుకున్న కథ. తన జీవితంలోని అనుభవాలకి రూపం ఇచ్చి, తనను తనతో పరిచయం వున్నవారిని దూరంగా నిలిపి, పాత్రలనుగా మలచి తాను అనుభవించిన కథనే మరోసారి కాయిం మీద పెట్టాడు చలం. మరొక విధంగా చూస్తే – ఈ కథ తన తరంలోని సమాజ వ్యవస్థలను, అందులోని కుళ్ళును గురించి కథ – కాదు – చలం తన కళ్ళతో ఆ సమాజ వ్యవస్థను ఎలా చూశాడో – దాని కథ.

చలం సాహిత్యాన్ని గురించి మాట్లాడుకొనేటప్పుడు మనం రెండు విషయాలను జ్ఞాపకం వుంచుకోవాలి. ఒకటి: చలం కథకుడు కాదు.

నవలా కారుడు కాదు. నాటకకర్త కాదు.
ఏ విధంగా చూచినా conscious artist కాదు.
ఆయన రచనల్లో శిల్పం బొత్తిగా మృగ్యం.
మరి చలం ఎవరు?
మున్ముందుగా చలం విప్లవవాది.

తన చుట్టూ వున్న సంఘంలో నెలకొని వున్న ఆచారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలు…మూర్ఖంగా, పాక్షికంగా కన్పించిన చలంలో జీవితపు విలువలకు మూలాధారమైన శక్తులేమిటి? సాంఘికమైన యీ విలువలా? లేక వ్యక్తినిష్టమైన విలువలా? అన్న మీమాంస వచ్చి, వ్యక్తి నిష్టమైన నిశ్చయాన్ని అతనిలో గాఢంగా నెలకొల్పింది. ఇట్టి వ్యక్తి నిష్టమైన విలువలకు పట్టం కట్టడానికి చలం రచయత అయినాడు. సాంఘిక విప్లవం కోసం తనలోని సృజనాత్మక శక్తిని ఆధికారికంగా వినియోగించుకున్నవాడు. షా, లానే – చలానికి కూడా కథ, నవల, నాటకం – యివి తన భావాలను వ్యక్తం చెయ్యడానికి వుపకరించే media మాత్రమే!

చలం ఆవేశానికి అక్షర రూపం
అతని సాహిత్య సృష్టి అంతా –
దేన్ని గురించి చలం ఆవేశం?
తన సమకాలీన సమాజం మీద –
అతని కోపం –
"పట్టు బట్టల మూలల, ఇనప పెట్టెల బంగారు
బరువుల కింద సగం నలిగిన నీతి పురుగుల – " మీద.

సమాజాన్ని నీతి పేరుతో తమకబంధ హస్తాలతో బంధించి వ్యక్తులకు స్వేచ్ఛ లేకుండా చేసిన సాంఘిక రాక్షసుల మీద – పరువు, ప్రతిష్టల పేరుతో డాంబికమూ, ఆత్మవంచనా పెరిగిపోతున్న సంఘానికి నియంతలైన పిరికి పందల మీద –

చలం అంటాడు: వెన్నెల తోటల్లో –

“లోకం కావిలించుకుంది, తన కులట హస్తాల్తో అతన్ని. మర్యాద, భయం, తన ఆస్తి, కుటుంబం, తన ఆశలు, కలలు.....

చూస్తున్నారు మనుషులు – తనని అక్కడ చూసివుంటే ఇంకేమన్నా వుందా? కరణంగారింట్లో తన పరువు? – ”

చలం చేసిన యీ స్వేచ్ఛాగానం, రచయితగా అతని స్థానాన్ని ఎలా నిరూపిస్తున్నదో తరువాత చెబుతాను.

ప్రస్తుతం – చలం చేసిన యీ స్వేచ్ఛను గురించిన ఆర్తి చాలవరకు స్త్రీ, పురుష సంబంధానికి మాత్రమే పరిమితం అయివుంది. అందువల్లనే చలం ఆగ్రహానికి గురి అయిన మొదటి సాంఘిక వ్యవస్థ కుటుంబం –

కొన్ని శతాబ్దాలుగా కుటుంబం భారతీయ సంప్రదాయానికి ఆలంబనం. కుటుంబ వ్యవస్థకు వివాహం ఆధారం. ఈ వివాహాలు జరిగే తీరు తెన్నులను గురించి, ఇష్టంలేని మొగుళ్ళతో పెళ్ళాలు కాపురం చెయ్యగం గురించి, నీతి పేరుతో ఆ రాక్షసుల్లాంటి మొగుళ్లు పెళ్ళాలను బానిసలుగా చూడ్డం గురించి, స్వేచ్ఛకోసం అలమటించే ఆ దీనుల ఆర్తిని గురించి – చలం చాలా చాలా రాశాడు. స్త్రీని యిలా బానిసగా చూడ్డం, ఆమెను exploit చెయ్యడానికి గాను మాతృత్వం, త్యాగం అన్నగొప్ప పదాలు వాడడం చెలం సహించలేదు. పాతివ్రత్యం పేరుతో స్వేచ్ఛని అరికట్టడం అత్యాచారం అని వాదిస్తాడు చలం.

సమాజం యిలా వున్నదని వూహించుకుని, అటువంటి సమాజాన్ని మార్చడానికి చలం కలం పట్టాడు. “నా రచనల సంఘటనలకి అబలల ఆర్తి ఆధారం. సంఘ బహిష్కృతులైన స్త్రీలు నాలో confied చేసుకున్న చరిత్రలు నా రచనలకి ఆధారం” అంటాడు చలం.

కథల్లో కనిపించే చలం ఇటువంటి విప్లవవాది. వివాహవ్యవస్థలోని కామగతమైన సంబంధాన్ని విమర్శించి స్వేచ్ఛతో స్త్రీ పురుషులు పరస్పరాకర్షణలతో, శృంగారంతో, అర్థం చేసుకున్న మనస్సులతో వెన్నెల వంటి జీవితాన్ని గడపాలని ఆకాంక్షిచాడు చలం.

"ఎందుకు" అన్న కథలో శాంతాదేవి పెద్ద జమీందారిణి – పెళ్ళయిన నాలుగేళ్ళకు భర్త చనిపోగా, కమతగాడితో సంబంధం ఏర్పరుచుకుని, అతని తిట్లకీ, తాగుడుకీ ఓర్చుకుని ప్రేమించే – ఆ శాంతాదేవి తన్ను చూసి జాలిపడ్డ వాళ్ళతో అంటుంది:

"నా కోసం మీరు పడే దిగులును చూసి నాకు నవ్వుగా వుంది...పురుషుడి నుంచి మీరెరిగిన ఆదరణ నగలూ, చీరెలూ, భార్యలూ – వండి, పడుకుని, కనే, మనుషులు – అంతే ఎట్లా చెప్పను? నువ్వు – ప్రత్యేకంగా 'నువ్వు' అనే గుర్తు – తన్నడానికైనా నువ్వేకావాలి, నిన్ను గుర్తించి, నిన్నే కోరి – మాటలతో సాధ్యం కాదు ఆ అనుభవం – నీ లోపల్నించి నిన్ను తెలుసుకుని బంధించనీ, చంపనీ, లాలించనీ – ఎంతో తృప్తి, చెబితే తెలీదు– " అంటూ వాపోతుంది. ఇటువంటి పాత్రలు చలం కథలనిండా కోకొల్లలు.

ఇంత తీవ్రంగా సంఘ బహిష్కృతలైన స్త్రీల కోసం పోట్లాడిన మనషి యీ విప్లవతత్వాన్ని కేవలం స్త్రీ, పురుష సంబంధాలకు మాత్రమే ఎందుకు పరిమితం చేసుకున్నాడు? ఆ ప్రశ్నకు సమాధానం దొరికితే రచయితగా చలంలో నాటకి, నేటికి వున్న మార్పులకు కూడా సమాధానం దొరుకుతుందనుకుంటాను.

చలాన్ని 'కామిగాక మోక్షకామి కాడు" అంటూ వెక్కిరించిన వారి మాటల్లో అర్థం లేదనలేం. ఎందువల్లనంటే తనలోని ప్రతి అనుభవాన్ని కథల రూపంలో వుంచాడు ఆయన. దానికి నా analysis యిది:

చలం స్త్రీ పురుషుల స్వేచ్ఛను గురించి చేసిన గానం కేవలం అంతవరకే పరిమితమైందన్నాను. ఈ స్వేచ్ఛాగానం romanticism లో ఒక భాగం. తెలుగు దేశంలోకి యీ romantic movement వుద్రేకం వచ్చిన కొత్త పొంగులో ఎందరో భావకవులు స్వేచ్ఛను గురించి గానం చేశారు. 'అమలిన శృంగారం' గురించి పాటలు పాడారు. ఫ్రెంచి విప్లవంలో రూసో చేసిన నినాదమే కొన్ని అడ్డదోవల గుండా పయనించి తెలుగు కాల్పనిక వాదంలో 'శృంగారం' రూపంలో దాక్కున్నది.

చలం భవికవిత్వపు తొలి రోజుల్లో కలం పట్టినవాడు. కొందరు భావ కవులు తమ వెనకటి రోజుల్లో వున్న జమీందార్ల వైభవాల వర్ణనలకు ప్రతిగా కొత్త కోకిల కంఠాలను వినిపించాలని ఆరాటపడ్డారు. కొందరు ఏర్పడిపోయిన రాజకీయ వ్యవస్థకు ప్రతిగా విజయశంఖం వూది "ఏ దేశమేగినా, ఎందుకాలిడినా" అనీ, "అమరావతీ పట్టణమున" అని ఆంధ్ర పౌరుషం ఎలుగెత్తేటట్టు పాడారు. మరికొందరు ప్రబంధ కవుల వుద్రంధాల వుక్కిరి బిక్కిరిలో చిక్కుకుపోయిన ప్రబంధ నాయికలకు వూపిరి పోసి, కొత్త వెన్నెలన్నీ, కొత్త సౌరభాలనీ వెదజల్లారు. ఇదంతా వెనుకటి తరం మీద దాడి. దానికి ప్రతిగా తమ స్వేచ్ఛను, క్రొత్తదనాన్ని చూపాలన్న ఆవేదన; చలానికి తనకు దగ్గరగా తన చుట్టూ జరుగుతూ ఏర్పడిపోయిన వ్యవస్థ తాలూకూ మురికి సంఘటనలు ఏవగింపు పుట్టించాయి. దానికి ఫలితమే రచయిత చలం.

చలాన్ని యిలా romanticist గా చూసినప్పుడు కాని మనకు అతనిలోని రకరకాల రంగులు, మార్పులు

అర్థం కావు. అప్పుడు కాని స్వేచ్ఛకోసం అతడు పడిన ఆరాటం అర్థం కాదు.

(తెలుగు కాల్పనిక యుగంలోని రచయితల్లో ఇద్దరు తీవ్రవాదులున్నారు; extremists; చలం, విశ్వనాథ. ఇద్దరూ సమకాలీన వ్యవస్థ మీద తిరుగుబాలు చేసినవారే!

చలం వ్యక్తుల స్వేచ్ఛను, కట్టుబాట్లకు లొంగని వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కోరాడు.

విశ్వనాథ – పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పతితమై పోతున్న వ్యవస్థలను మన పూర్వుల నైతిక, సాంస్కృతిక జీవనం వైపుకు నడపాలని కోరాడు)

'రొమాంటిక్' చలం కథల్ని అర్థం చేసుకోవడానికి – అతనిలో వచ్చిన మార్పులు మనకు అడ్డం వస్తాయి. కాని మిగిలిన భావ కవిత్వపు రచయితలకు వలెనే చలాన్ని కూడా అన్వేషిగా స్వీకరిస్తే యీ చిక్కు యిట్టే విడిపోతుంది.

గురజాడ మానవతాన్వేషి
రాయప్రోలు దేశస్వాతంత్ర్యాన్వేషి
కృష్ణశాస్త్రి శృంగారాన్వేషి
విశ్వనాథ నైతిక జీవనాన్వేషి
చలం సౌందర్యాన్వేషి

చలమే కాదు, భావనకవిత్వపు రోజుల్లో ప్రతి రచయితా సౌందర్యాన్వేషే! చలంలో సౌందర్యాన్వేషణ ఎలా పెరిగి ఎన్ని మలుపులు తిరిగిందో – అతని కథల ఆధారంతో మనం చూడొచ్చు.

ఈ సౌందర్యాన్వేషణ ప్రతివ్యక్తికీ బాహ్య కర్షణతో ప్రారంభం అవుతుంది. చలంలోను అంతే! చలం కథల్లోని స్త్రీ వర్ణనలున ప్రబంధ కవుల్లో! రచనలకు ఏ మాత్రం తీసిపోవు – మరీ మొదటి పదేళ్ళలో చలం రచనల్లో యీ వర్ణనలు కొట్ట వచ్చినంత నగ్నంగా వుంటాయి. ఈ దశలో చలానికి – అంటే అతని స్త్రీ పురుషులకి శరీరాకర్షణే ముఖ్యం – పరస్పరం ఆకర్షించుకున్న శరీరాలు కలవడం; అటువంటిది లేకుండా వివాహ వ్యవస్థతో ఆ అధికారాన్ని సంపాదించుకున్న శరీరాల కలయిక మీద ఏవగింపు – ఇది చలం మొదటి రచనల్లో కనిపించే విషయం.

రెండవదశలో యీ నిరంతర సౌందర్యాన్వేషణ శరీరపుటంచుల్ని దాటి, హృదయం వైపుకు సాగింది. రెండు హృదయంలేని రాక్షసపు కౌగిలింత కాదు. దీనిలోనే మరో మెట్టు ఆ హృదయపు టవధులను కూడా దాటి కేవలం మానసిక మైన సౌందర్యానుభూతి. మనస్సుల, భావాల తాదాత్మ్యం. నిశ్శబ్ధమైన నిశధిలో –

దూరంగా వుంటే – ఒకరి మనసుల్ని ఒకరు కొలుచుకోవడం; ఒకరి అనుభవాలను ఒకరు అందిపుచ్చుకోవడం

ఈ రెండో దశ చివర్లో – ఇంతకన్నా మరో ఉత్కృష్టమైన సౌందర్యానుభూతిని ఆశించే కవిగా చలం మనకు "ఓ పువ్వు పూసింది"లో కనిపిస్తాడు. మొదట స్త్రీని కామోపభోగ్యమైన వస్తువుగాను, తరువాత స్త్రీని స్నేహితుడుగాను, తన జీవితానికి మార్గదర్శిగాను చూసిన చలం స్త్రీలోని మాతృత్వాన్ని చూస్తాడు.

అది కేవలం పువ్వు పూసిన కథే అయినా, ఆ పువ్వు పూసి, వికసించి, తన యవ్వనాన్ని గురించి గ్రహించి, తనలో తేనెలు నింపుకున్న వృత్తాంతమే అయినా – వీటన్నిటిని మించిన మాతృహృదయం అతనికి ఆ పువ్వు కథలో కనిపిస్తుంది.

తల్లి పువ్వు, పిల్లతో చెబుతుంది: "నేనే తెచ్చుకున్నాను నిన్ను; నాగారాబాన్ని, నా బంగారాన్ని; నా ముద్దుల మురిపాన్ని నిన్ను – "

తన వెనకటి భావాల నన్నింటినీ – సంపూర్ణంగా యిందులో సంక్షిప్తీకరించాడు చలం.

అతడు సృష్టించింది ఒక matrilineal society. ఆ వ్యవస్థలో ముఖ్యం పురుషుడు కాదు; స్త్రీ. ఆమె మాతృత్వం ఆ వ్యవస్థను నిలబెట్టి వుంటే సహజమైన బంధం. కొత్త జన్మని యీ లోకంలోకి ఆహ్వానించి అమృత మయమైన మమతల్ని దానిలో నింపి - దాన్ని ఎదిగి, వికసించి స్వేచ్ఛగా - కాలం గడపమని ఉద్బోధిస్తుంది.

ఈ కథ చలం సిద్ధాంతాలకు ప్రతీక.

అయితే చలం అంతటితో ఆగలేదు. ఈ అన్వేషణను మించి యింకా ఆవతల ఏమున్నదని వెదికాడు. భగవాన్ కన్పించాడు. యీ శోదాగీతాల్లో తానే మాతృమూర్తిగా ఊహించుకొని తన లోకి రమ్మని భగవాన్ని ప్రాధేయపడ్డాడు.

ఇది ఇప్పటి స్థితి. ఇంకా ఇంకా అన్వేషిస్తూ చలం ఎటు పయనిస్తాడో ఇంకా చూడవలసి వుంది. చలంలో ఈ అన్వేషణను చూస్తే ఇంగ్లండులోని romantic poet – Wordsworth ప్రకృతి ఆరాధన జ్ఞాపకానికి వస్తుంది. ప్రకృతి బాహ్యరూపాన్ని ఆరాధించడంలో ప్రారంభమైన అతని జీవితం – ప్రకృతి భగవత్స్వరూపంగా భావించే pantheism తో అంతమయింది –

ఈ సౌందర్యాన్వేషణ మనకు స్పష్టంగా వేరు వేరు దశల్లో వ్రాయబడిన వేరు వేరు కథల్లో కనిపిస్తుంది. "కొత్త చిగుళ్ళు", "ఎందుకు", "పాపఫలాలు", కళారాధన" కథల్లో మొదటి దశలోని చలం కనిపిస్తాడు.

“రసపుత్రలు”, “శమంతకమణి ఇంటర్వ్యూ” వంటి కథల్లో ప్రేమ, స్నేహాలను ఉత్తమ ఆదర్శాలుగా పేర్కొన్న రెండవ దశలోని చలం కనిపిస్తాడు. “ఎందుకు మీకీ విరక్తి?” అని సినిమా స్టారు శమంతకమణిని రచయిత చలం ప్రశ్నిస్తే – ఆమె సమాధానం...

“ప్రేమే అనుకుంటాను జవాబు. మీరనుకొనే ప్రేమకాదు. అసలు మనుషులకీ మనుషులకీ సహజమైన స్నేహం లేనప్పుడు ఊపిరాడ్డం కష్టం” అంటుంది ఆమె.

ఈ దశలో స్నేహం తరువాతిది మాతృత్వం – కాని యీ అన్ని దశలనీ కూడా చలం “వెన్నెల తోటలు” అన్న కథలో స్పష్టంగా చిత్రీకరించాడు.

శ్రీధరరావు అనే పట్నం ప్లీడరు 16 ఎకరాల తోటని చౌకగా కొనడానికి పల్లెటూరు వస్తాడు. అక్కడ ఆ తోటని అమ్మ చూపిన యువకుడు ‘ఎక్కణ్ణుంచో తెచ్చిన’ ఓ యువతితో పరిచయం అవుతుంది.

ఆమెను చూసిన శ్రీధరరావుకి గత జీవితంలోని కొన్ని ఘట్టాలు జ్ఞాపకం వస్తాయి: ఎప్పుడో చాలారోజుల క్రితం – ఏటి ఒడ్డున తోటలో వెన్నెల్లో – ఒకామె. తన కోసం వెదుకుతూ వెళ్ళాడు ఆమె వొళ్ళోకి. మెడని కావలించుకుని ఆమె చంపమీద చంపానించాడు. తటాలున అతను ఆమె మీదికి వొరిగిపడి, ఏ సంకోచం లేకుండా ఆమె పమిటని –

ఈ ఘట్టం వర్ణించడానికి ముందు అతడు, ఆమె బాహ్యాకర్షణకు చిహ్నం.

రెండవ ఘట్టం!

కుర్రాడు పెరిగి పెద్దవాడయినాడు. అతని పెళ్లి అనుకుంటున్నారు. రోడ్డుమీద గాజు గొట్టంలోంచి బుడగలు వూదుకుంటున్న తనకు బుడగలో ఒకామె రూపం కనిపించింది. ఆమె తనని చేతులతో ఎత్తి వేసుకుంది. చెట్టుకింద పడుకుని పక్కన కూచోపెట్టుకుంది. ఆమెను చూడగానే గొప్ప ప్రేమ పుట్టుకొచ్చింది అతనికి. జీవితం అనంతమైన ఆనందమనిపించింది. ‘రా, ఆలస్యం చేయకు’ అని చేతులు చాచింది ఆమె. ఆ పచ్చని గడ్డిలో, కలకల నవ్వే పూలమధ్య ఆమెని కావిలించుకున్నాడు నిలువునా.....

కల చెదిరింది.....

“జట్కా, జట్కా...తోవ, తోవ” అన్న అరుపులు ఇక్కడ బాహ్యా సంబంధం కన్న మనుసుల, మమతల కలయిక ఆకర్షణ ముఖ్యంగా గోచరిస్తుంది.

ఇక మూడో ఘట్టంలో –

కుర్రాడు పెద్దవాడయినాడు. అతనికి కొడుకు. దేశంకోసం జైల్లో ఉన్నాడు. వెన్నెల రాత్రి. చంద్రబింబం దగ్గరికి వొచ్చింది. అందులో ఆమె.

“రా” బైటికి, పైకి తీసుకుంది అతన్ని. వెళ్ళిపోయినారు యిద్దరూ మళ్లీ ఆ తోటలోకి.

“కాగలవా యింకా అందంగా”

“ఊ! కానీ నీకు అసలు ఆ అందం దొరక్కపోవచ్చు. తెలీకపోవచ్చు”

“ఏమీ వొద్దునాకు.....నా దగ్గరికి; చాలా దగ్గరికి, నాలో ఐపో – ”

“వొదలకు నన్ను, వెళ్ళను” అంటుంది ఆమె. కాని ప్రయత్నం లేకుండానే తాను వెడుతున్నాడు. కన్నీళ్ళతో చేతులు జాచి నుంచున్న ఆమె నుంచి, దూరంగా ఎవరో తీసుకెడుతున్నారు తనని కటకటాల వెనక్కి

వెన్నెల కన్య సౌందర్యానికి ప్రతీక.

శ్రీధర రావే చలం!

తన చుట్టూ వున్న జీవితంలో మానవుల్ని తీవ్రంగా స్పందింప చేసే స్త్రీ పురుష సంబంధాన్ని ఆలంబనంగా చేసుకుని దాని చరమసీమల్ని సౌందర్యాన్వేషణగా అందుకున్న వాడు చలం.

సమకాలీన సమస్యలకి చలం స్పందించినంత తీవ్రంగా రచయితా స్పందించలేదు. “రామభక్తుడు”, “అప్పుడూ – యిప్పుడూ”, “హరిజన సమస్య” వంటి ఎన్నో కథల్లో కృత్రిమమైన రాజకీయ లోలుపత్వాన్ని, దొంగ కాంగ్రెసు భక్తుల్నీ తీవ్రంగా విమర్శించాడు చలం కృత్రిమత్వాన్ని దేన్నీ సహించలేని చలం.

యాభై యేళ్ళుగా రచనలు సాగిస్తోనే వస్తున్న చలం కథకుడుగా conscious artist కాదని ముందే చెప్పాను. తన కళ్ళకి కనిపించిన దాన్ని మనసు చెప్పిన పద్ధతిలో రాసేశాడు చలం. సమాజంలో ఇతర సాహిత్య వర్గాల్లో తాను రాసిన రచనల మీద దుమారం రేగే సరికి ఇంకా బిగిసి చెప్పిందాన్నే పదే పదే, ఇంకా ఇంకా నిశితంగా, ఇంకా నగ్నంగా చెప్పాడు.

చలం రచనల మీద దుమారం – అతన్ని సంఘ విప్లవం కోసం పోరాడే రచయితగా చేసివుండకపోతే – కేకల భావుకుడిగా వుండిపోతే చలం ఓ గొప్ప prose - poetry వచన గీత రచయిత అయ్యే వాడేమో!

ఇంత రాసినా కథకుడుగా చలానికి యీనాడు సాహిత్యంలో వున్న స్థితి ఏమిటి?

చలం రచనల్లో ఎన్నో short comings వున్నాయి. అతడు తీసుకున్న వస్తువు ఎంతో పరిమితమైంది. పైగా అతడు conscious artist కాదు. అతని నవలల్లో కథానికకు వుండవలసిన ఓ ఒక్క సూత్రమూ అన్వయించబడదు. అందులో ఏకాగ్రత లేదు; పాత్రలు రచయిత చేతుల్లో కీలు బొమ్మలు. మరీ ఉద్రేకం వచ్చినప్పుడు, కథ పట్టులో వున్నప్పుడు పాత్రల్ని రంగంమీద నించి తరిమి చలమే stage మీదికి వచ్చి తిట్టవలసిన వాళ్ళని తిట్టి మరీ నిష్క్రమిస్తాడు.

చలం "సమాజం, దాని సమస్యలు" – వీటికి negative approach నే చొప్పించాడు. నిర్మాణాత్మకంగా దీన్ని పరిష్కారించడం ఎలానో ఏనాడు చెప్పలేదు – అతని కథావస్తు స్వీకరణలోనే సంకుచితత్వం గోచరిస్తుంది. తన అభిప్రాయాలకు భిన్నంగా – ఆ రోజుల్లో కూడా పెళ్లిళ్లు చేసుకుని హాయిగా జీవితాలను గడిపే వాళ్ళున్నారన్న విషయం ఏనాడు చలం నమ్మిన పాపాన పోలేదు!

పైగా చలం ఎందుకోసం కలం పట్టాడో ఆ సమస్యలు యీనాడు లేవు. ఎక్కడో ఒకటో, రెండో సంఘటనలు అటువంటివి జరిగినా – ఎక్కువ భాగం స్త్రీ, పురుషుల సంబంధం – ప్రేమ మీదనో, పరస్పర అంగీకారం మీదనో ఆధారపడే వుంటోంది.

ఇటువంటి పరిస్థితుల్లో – topical writings వ్రాసి కూడా – చలం యింకా రచయితగా బతికి వున్నాడు, వుంటాడు – యింకా యింకా ఎక్కువ మందిని ఆకర్షిస్తాడు అంటే – దానికి కారణం ఏమిటి?

ఇదే ప్రశ్న బెర్నార్డ్ షాకు కూడా వర్తిస్తుంది. అతని విషయంలో చెప్పే సమాధానమే చలం విషయంలో చెప్పొచ్చు.

చలం ఏ సమస్యలను దృష్టిలో వుంచుకుని రాశాడో, ఆ సమస్యలు యీనాడు లేకపోయినా, చలం రచనల్లో నైశిత్యం, పటుత్వం, అతన్ని కలకాలం నిలిపి వుంచుతుంది. అతని వస్తువులోని యూనివర్సాలిటీ – సార్వజనీనత – అతన్ని నిలపి వుంచుతుంది.

అతడు ఏ స్త్రీ పురుషులను గురించి వ్రాశాడో ఆ స్త్రీ పురుషులు కలకాలం వుంటారు – ఎటువంటి రాజ్యాంగ వ్యవస్థలోనయినా – చలం రచనల్లో మైదానం అమీనా వంటివి యింకా చాలా కాలం నిలిచి

వుంటాయి – స్త్రీ, పురుషుల్లో యవ్వనం వుండే దాకా –

కాని రచయితగా, భావుకుడుగా చలం నిలవడానికి అతని భాష, శైలి, పటిష్టత, కారణం అనుకుంటాను, నేను. ఇక్కడ కూడా చలం కాల్పనికత కొట్టవచ్చినట్టు కన్పిస్తుంది. ముఖ్యంగా అతని పదచిత్రాలలో – images ప్రకృతి వర్ణనలు, స్త్రీ వర్ణనలు, వెన్నెలను గురించిన వర్ణనలు – అతని కథలనిండా ఎన్ని వున్నాయో!

"ఆ రాత్రి నిద్రపోలేదు అతను. పక్క మీద కూచిన కిటికీలోంచి ఆలస్యంగా పూసిన మామిడి పూలలో ఆడుకునే మిణుగురు పురుగుల్ని చూస్తున్నాడు.....మెల్లిగా నవమినాటి చంద్రుడు పుబ్బతో వుదయిస్తున్నాడు. ఆ చెట్టుది అదో ప్రపంచం. ఆ చెట్టు ప్రపంచానికి చంద్రోదయం ఏమనిపిస్తోంది? ఆ కాంతి పెద్ద వెలుగీతుందా? లేక ఆ కాంతిని భరించలేని కీటకాల కళ్ళకి అంధకారమౌతుందా?

"నీలాకాశం కరిగి శరత్ కాంతిగా
భూమిమీద వర్షిస్తోంది"

ఇక చలం భాష అతని వుద్వేగాలకు అనుగుణంగా అతన్ని వెంటనంటి నడిచే చెలి. ఇంత పటిష్టమైన వ్యవహారిక భాషని అప్రయత్నంగా రాయగలిగిన వాడు గొప్ప రచయిత కాకుండా వుండడం ఎలా? అతని వాక్యాల్లో క్రొత్తదనం, అతని భావాల్లోని వినూత్నకు మాదిరిగానే fresh గా వుంటుంది. ఆ వాక్య నిర్మాణంలో కృతకంలేదు. దాని కోసం పరిశ్రమ లేదు. కర్త, కర్మ, క్రియలు అదే స్థానంలో అలానే వుండాలని లేదు –

చలం భాషను గురించి ప్రత్యేక వ్యాసం వ్రాయగలిగినంత విషయం వుంది. మచ్చుకు – చలం వాక్య నిర్మాణంలో ప్రత్యేకతగా ఒకటి రెండు విషయాలు:

మొదటిది – కర్తను చిట్టచివర చెప్పడం "ఆ వెనక దొడ్డి వేపు పాకలో చుట్టకాలుస్తూ పడుకుంది నా కథానాయిక" – "ఎవరో వచ్చారు నీకోసం" – "చప్పున ప్రాణం వచ్చింది ఆమెకు. సిగిరెట్టు తీసి, వెలిగించుకునే మిషతో అగ్గిపుల్ల గీసి చూశాను ఆమెను"

వాక్యానికి చివరగా విశేషణాలు – ఎన్నో – ఒకదాని తరువాత ఒకటి: "అతని రౌడీ మిత్రులు అతని పేరు లిస్టులోంచి కొట్టేస్తున్నారు – ప్రయోజకులలోకి, మర్యాదస్తులలోకి – మరణించడానికి –

చలం యింకా చదవవలసింది సమకాలీన సమాజంలోని వ్యక్తులమీద అతను చేసిన నిశితమైన వ్యంగ్యానికి – "తెలుగు నవల" కన్న నిశితమైన వ్యంగ్యం రచన యిప్పట్లో రాదనుకుంటాను.

చలం వాక్యనిర్మాణంలో చూపించే suggestion కొత్తగా వుంటుంది ఇందాకటి వాక్యం –

అంటే ప్రయోజకులు, మర్యాదస్తులు అని లోకం అన్నది అంటే అతని మరణానికి అది చిహ్నం అన్నమాట! అటువంటిదే మరోటి – "లోకం కావిలించుకుంది తన కులటహస్తాల్తో అతన్ని. మర్యాద, భయం, తన ఆస్తి, కుటుంబం, తన ఆశలు, కలలు......వొస్తున్నారు మనుష్యులు" అంటాడు వెంటనే "మనుష్యులకు మారుపేరన్నమాట మర్యాద, భయం, ఆస్తి కుటుంబం మొదలైనవి. స్త్రీత్వం మీద కొత్త దృక్పథాన్ని యీతరం వాళ్ళకి అందించిన ఘనత చలందే! వివాహ వ్యవస్థలో వచ్చి, వస్తున్న మార్పుకి చలం కృషి కొంతైనా కారణం! ఇవన్నీ చలం సాహిత్యం సాధించిన పరోక్ష విజయాలు!

> తెలుగు భాషలో అతను తెచ్చిన తియ్యదనం కొత్తదనం అతన్ని కలకాలం మన మధ్య వుంచుతుంది – షాని, మొపాసాని, గాల్స్ వర్దీని మరో దేశంలో జనం ఎందుకు చదువుతారో, చలాన్ని మనం అందుకే చదువుతున్నాం, చదువుతాం –